🌐 : www.aknu.edu.in
✉ : nannayavani@aknu.edu.in
▶ : nannayanewstv
f : Adikavi Nannaya University
☏ : 9701293231

చాళుక్య ద్వారము
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ADIKAVI NANNAYA UNIVERSITY

For Internal Circulation Only

# నన్నయ వాణి

An in-house Weekly Newsletter

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

Accredited by NAAC with 'B+' Grade, ISO 9001 : 2015 & AICTE Certified

గౌరవ సంపాదకులు
ఆచార్య కొప్పిరెడ్డి పద్మరాజు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య గోడి సుధాకర్
కులసచివులు

సంపాదకులు
డా.తలారి వాసు
సహాయాచార్య
తెలుగు శాఖ

పువ్వల ఆనంద్
ప్రజా సంబంధాల అధికారి
కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 4 | సంచిక : 27 | 1-04-2024 | పుటలు : 4


## బెస్ట్ ఫిజిక్‌లో నన్నయ వర్సిటీకి గోల్డ్ మెడల్



ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ బెస్ట్ ఫిజిక్ ఛాంపియన్షిప్ 2023-24లో ఆదికవి నన్నయ యూనివర్సిటీకి గోల్డ్ మెడల్ దక్కిందని వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. యూనివర్సిటీలో గురువారం బెస్ట్ ఫిజిక్ లో గోల్డ్ మెడల్ సాధించిన కోడూరి పవన్ కుమార్ కు వీసీ పద్మరాజు మెడల్స్ ప్రదానం చేసి అభినందించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ యూనివర్సిటీ ఆఫ్ కాలికట్ లో ఫిబ్రవరి 2 నుండి 4వ తేదీ వరకు జరిగిన ఆల్ ఇండియా బెస్ట్ ఫిజిక్ +95 కేజీల కేటగిరిలో ఆదికవి నన్నయ యూనివర్సిటీ పి.ఆర్. గవర్నమెంట్ కాలేజ్ కాకినాడ కు చెందిన కోడూరి పవన్ కుమార్ గోల్డ్ మెడల్ కైవసం చేసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఎంతో కృషి పట్టుదలతో సాధన చేసి దేశవ్యాప్తంగా జరిగిన పోటీలలో సత్తాచాటిన పవన్ కుమార్ ప్రతిభను వీసీ ప్రశంసించారు. ఉన్నత లక్ష్యాలతో మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. ఉమ్మడి గోదావరి జిల్లాలో ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం చక్కని వేదిక అవుతుందని తెలియజేసారు. ముఖ్యంగా క్రీడల్లో నన్నయ విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల్లో ఎంతో ప్రతిభావంతులైన యువతరం ఉందన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ కీర్తి ప్రతిష్ఠలు దేశవ్యాప్తంగా చాటిచెప్పేలా విద్యార్థులు తయారు కావాలని అన్నారు. విశ్వవిద్యాలయం తరపున రూ. 30,000 నగదును పవన్ కుమార్ కు అందజేసి అభినందించారు. గోల్డ్ మెడలిస్ట్ పవన్ కుమార్ మాట్లాడుతూ 2022 ఛండీఘడ్ యూనివర్సిటీలో జరిగిన పోటీలలో బ్రాంజ్ మెడల్ సాధించానని ఈ ఏడాది గోల్డ్ మెడల్ దక్కడం ఆనందంగా ఉందన్నారు. స్పోర్ట్స్ కోటాలో రైల్వే ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో కృషి చేస్తున్నానని తెలియజేసారు. తన ప్రతిభను ప్రోత్సహిస్తూ సహకరిస్తున్న తల్లిదండ్రులకు, కళాశాల, యూనివర్సిటీ బృందానికి కృతజతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఆచార్య పి.సురేష్ వర్మ, స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డా.బి.రామ్ గోపాల్, పీడీ కె.వెంకన్న బాబు మరియు అధ్యాపకులు పవన్ కుమార్ కు అభినందనలు తెలియజేశారు.

## ఏప్రిల్ 1న నన్నయలో బి.ఈడీ స్పాట్ అడ్మిషన్స్

ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ లో బి.ఈడీ ప్రవేశాలకు ఏప్రిల్ 1వ తేదీన స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తున్నామని రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ తెలిపారు. బి.ఈడీ రెండేళ్ల కాలవ్యవధి గల కోర్సులో ప్రవేశాలకు ఆసక్తి, అర్హతగలవారు హాజరుకావాలన్నారు. రెగ్యులర్ సీట్లు 14, ఈ.డబ్ల్యూ.ఎస్ 5 సీట్లు ఖాళీ ఉన్నాయన్నారు. తప్పనిసరిగా ఏపీ ఎడ్ సెట్ 2023 ప్రవేశ పరీక్ష కు హాజరై ఉండాలన్నారు. అన్ని ఒరిజినల్ ధ్రువ పత్రాలతో ప్రభుత్వం నిర్దేశించిన రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. బి.ఈడీ స్పాట్ అడ్మిషన్స్ కొరకు వచ్చే విద్యార్థులు ఏప్రిల్ 1వ తేదీ ఉదయం 9 గంటలకు యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయానికి హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆచార్య డి.జ్యోతిర్మయి, 7093008473 నెంబర్ ను లేదా యూనివర్సిటీ వెబ్ సైట్ ను సంప్రదించాలన్నారు.


## మూడ్లెస్ లెర్నింగ్ ఫ్యాకల్టీ ట్రైనింగ్ ప్రోగ్రాం



ఆదికవి నన్నయ యూనివర్సిటీలో 'మూడ్లెస్ లెర్నింగ్ మేనేజ్మెంట్ సిస్టమ్ ఫర్ టీచర్స్ ప్రొఫెషనల్ గ్రోత్ అండ్ గ్లోబల్ రికగ్నేషన్' అంశాలపై ఫ్యాకల్టీ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ను నిర్వహించారు. బుధవారం యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య కె.పద్మరాజు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, రిసోర్స్ పర్సన్ గా జె.ఎన్.టి.యు.కె. మ్యాథమెటిక్స్ విభాగాధిపతి ఆచార్య వి. రవీంద్రనాథ్, యూనివర్సిటీ ట్రైనింగ్ ఆఫీసర్ డా.టి.హైమవతి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వీసీ ఆచార్య కె.పద్మరాజు మాట్లాడుతూ ఆదికవి నన్నయ యూనివర్సిటీ అధ్యాపకులకు సాంకేతిక విజ్ఞానానికి సంబంధించిన అన్ని అంశాలపై అవగాహన కల్పించేందుకు ఫ్యాకల్టీ ట్రైనింగ్ ప్రోగ్రామ్స్ నిర్వహిస్తున్నామని అన్నారు. ఇటీవల కాలంలో విశ్వవిద్యాలయంలోని అధ్యాపకులకు వివిధ అంశాలపై శిక్షణ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించామని చెప్పారు. అధ్యాపకులు నిత్య విద్యార్థులుగా ముందుకు సాగాలన్నారు. కొత్త విషయాలను తెలుసుకొని విద్యార్థులకు బోధించాలనే తపన కలిగి ఉండాలన్నారు.రిసోర్స్ పర్సన్ గా జె.ఎన్.టి.యు.కె. మ్యాథమెటిక్స్ విభాగాధిపతి ఆచార్య వి.రవీంద్రనాథ్ మాట్లాడుతూ మూడ్స్ అనే ఆన్లైన్ ప్లాట్ ఫామ్ ద్వారా ఆన్లైన్ టీచింగ్ పద్దతులను మెరుగుపరచుకోవచ్చునన్నారు. ఆన్లైన్ లో కంటెంట్ ను సిద్ధం చేయడంతో పాటు బోధించడానికి, విద్యార్థులకు పరీక్షలు నిర్వహించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. అధ్యాపకులకు ఆన్లైన్ బోధన విధానాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. రిజిస్ట్రార్ ఆచార్య జి. సుధాకర్ మాట్లాడుతూ ఇటువంటి నూతన సాంకేతిక విధానాలపై అధ్యాపకులు పట్టు సాధించాలని సూచించారు. రిసోర్స్ పర్సన్ ఆచార్య వి.రవీంద్రనాథ్ ను విశ్వవిద్యాలయ అధికారులు సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



# సంపాదకీయం



# హలో....!

శరీరమంటే అవయవాలు.కొత్తగా చేరిన అవయవం మొబైల్ ఫోన్. నిజమే. అంతగా మన జీవితంలో భాగమైంది.కాదు కాదు శరీరంలో భాగమైంది. సమాచారాన్ని ఇచ్చి పుచ్చుకోవటంతో మొదలై సమస్త కార్యాలకు కారణమైంది.ఉదయం అలారం మోతతో మొదలై రాత్రి ఇన్స్టాగ్రామ్ రీల్స్ వినోదంతో పూర్తవుతుంది. మధ్యలో వాట్సాప్, నెట్ బ్యాంకింగ్, గూగుల్, ఆన్లైన్ వ్యవహారాలు, చదువులు, ఉద్యోగాలు, సందేశాలు, పుస్తకాలు, వీడియోలు,సినిమాలు,వార్తలు,టికెట్ బుకింగ్స్.... అమ్మో! ఇప్పుడు సెల్ఫోన్ గురించి రాయాలంటే చిన్న వ్యాసం కుదరదు.చాలా అధ్యాయాలతో మహాగ్రంథమౌతుంది.

1995లో ఇది వచ్చిన తొలిదశలో విలాస వస్తువు. కానీ మలిదశలో అవసరంగా మారింది. సామాన్యుడికి అందుబాటులోకొచ్చింది. ఇప్పుడు ఇల్లులేనివాళ్ళు ఉన్నారేమో కానీ, సెల్లు లేనివాళ్ళు అంటూ ఎవరూలేరు. ప్రస్తుతం అవసరమే కాదు,అవకాశం కూడా. మనదైన రంగంలో విజయానికి, వికాసానికి సాధనంగా మారింది. టెక్నాలజీ పెరిగింది మొబైల్ మనల్ని నడిపిస్తుంది. నవ్విస్తుంది. ఏడిపిస్తుంది. ఎక్కడ సెల్ఫోనో అక్కడ అభివృద్ధి అనే నినాదంగా మారింది.

రాబిన్ జెఫ్రీ అనే అమెరికన్ రచయిత ఇండియన్స్ జీవితాల మీద సెల్ ఫోన్ ఎలా ప్రభావితం చేస్తుందో తెలుసుకోవటానికి మన దేశమంతా పర్యటించి "సెల్ఫోన్ నేషన్"అనే పుస్తకం రాశాడు. సెల్ఫోన్ లేని రైతుకన్నా సెల్ ఫోన్ ఉన్న రైతు వ్యవసాయంలో ఉత్పాదక శాతం గణనీయంగా మెరుగుదల కనిపించిందన్నాడు. నిజమే సెల్ఫోన్ మాయల ఫకీర్ మంత్ర దండం కాదు, నెట్వర్కింగ్ తంత్రం.ఈ సంచారవాణి పవిత్రమైంది.దీనికి ఏవీ అంటవు.కొన్నిటికి అతీతమైంది. చిల్లర వ్యాపారాల నుంచి బ్యాంకింగ్ వరకు ఇదే ప్రతి రంగాన్నీ శాసిస్తుంది. సెల్ఫోన్ ఇంట్లో మర్చిపోయి బయటికెళ్ళండి. గందరగోళమైపోతారు.చేతిలో సెల్ఫోన్ ఇవాళ ఒక ఆత్మవిశ్వాస ప్రతీక.మహిళలకైతే సాధికారిక ఆభరణం.

మెడ ఒంచి అరచేతిలోకి చూడటం అలవాటైపోయిన మనం ఆ సాంకేతిక పరిజ్ఞానంతో ఇప్పుడు నిప్పులు చిమ్ముకుంటూ నింగికి ఎగిరిపోవటమా,నిస్సహాయంగా పాతాళంలోకి కూరుకుపోవటమా అనేది మనిష్టం.అది మనుషుల మానసిక స్థితికి సంబంధించిన వ్యవహారం.మంచి చెడులతో యంత్రానికేంపని?! అణుబాంబు లాంటి సెల్ఫోన్తో ఆవిష్కరణలు చేయాలి.విస్ఫోటనాలు కాదు. మరి ఉంటానండి.ఎవరో ఫోన్ చేస్తున్నారు. హలో...!

– డా.తలారి వాసు,
నన్నయవాణి.



# కాకినాడ క్యాంపస్‌లో ధ్యానంపై అవగాహన

ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్ కాకినాడ నందు "హార్ట్ ఫుల్నేస్ మెడిటేషన్ ఆర్గనైజేషన్" వారిచే క్యాంపస్ లోని విద్యార్థులకు మరియు అధ్యాపకులకు మూడు రోజులపాటు జరిగే సదస్సులో ధ్యానం ఏ విధంగా చేయాలనే అంశాలపై అవగాహన మరియు వివిధ ధ్యాన విధానాలను తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన క్యాంపస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ప్రశాంతిశ్రీ మాట్లాడుతూ ఈ ఉరుకుల పరుగుల జీవితాలలో మనసుకు శాంతిని మన శరీరానికి సమర్థత పెంచేది ధ్యానం అని అట్టి ధ్యానం ఏ విధంగా చేయాలనేది చాలామందికి అవగాహన ఉండదు. అలాంటి అవగాహన కల్పిస్తున్నందుకు హార్ట్ ఫుల్నేస్ మెడిటేషన్ సభ్యులు కె.పద్మావతి, డి.సుబ్బలక్ష్మి అవగాహన కల్పిస్తున్నందుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాధా మాధవి తదితర ఆధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొని ధ్యానంలో మెలకువలు నేర్చుకున్నారు.




# ఏఐ డేస్ సదస్సులో నన్నయ అధికారులు

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మరియు మెషిన్ లెర్నింగ్‌పై భారతదేశపు అతిపెద్ద కాన్ఫరెన్స్, AI డేస్ 2024, మార్చి 30 మరియు 31 తేదీల్లో జే.ఎన్.టీ.యూ హైదరాబాద్‌లో జరిగింది. ఏఐ డేస్ 2024 సదస్సులో 2,000 మందికి పైగా ఐటి నిపుణులు, పరిశోధకులు, స్టార్టప్‌లు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. ప్రపంచవ్యాప్తంగా 60o స్పీకర్లతో కూడిన నక్షత్ర శ్రేణితో, ఈ సమావేశం హైదరాబాద్‌ను ఏఐ రాజధానిగా మార్చడానికి మార్గం సుగమం చేసింది. ఈ క్రమంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ టెక్నాలజీని అభివృద్ధి చేయడానికి, దానిపై పూర్తి అవగాహనను పెంపొందించుకోవడానికి సదస్సులో విశ్వవిద్యాలయ అధికారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వీసీ ఆచార్య కె.పద్మరాజు, విశ్వవిద్యాలయ అధికారులు పి. సురేష్ వర్మ, వై. శ్రీనివాసరావు, పి. విజయ నిర్మల, బి.జగన్మోహన్ రెడ్డి,




ఎ.మట్టారెడ్డి, ఎన్.ఉదయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



# ఏది విద్య - ఎవరు ఉపాధ్యాయుడు


విద్య ను
భుక్తికి మార్గంగా కాక
పీడితుల విముక్తి సాధనంగా
భావించే ఉపాధ్యాయుడు

బోధనను
యాంత్రిక కలాపంగా కాక
సృజనాత్మక కార్య కలాపంగా
మలచుకునే ఉపాధ్యాయుడు

జీతం రూకల కోసం కాక
ఆత్మ తృప్తి కోసం అంకిత భావంతో
పనిలో తలమునకలయ్యే
ఉపాధ్యాయుడు

ఏం సాధించగలడు.
సమాజ గమనాన్ని ఎలా
తన చర్యలతో, బోధనతో ప్రభావితం
చేయగలడో
తెలియాలంటే ...

ద్వారక 'పల్లె పిలిచింది' ,
వ్యంకటేశ్ మాడ్గూళ్కర్ 'బన్ గర్ వాడీ'
చింగిజ్ ఐత్ మాతోవ్ 'తొలి
ఉపాధ్యాయుడు'
వి.ఎ. సుహొమ్లిన్ స్కీ 'పిల్లలకే నా
హృదయం అంకితం'
పుస్తకాలు తప్పనిసరిగా చదవాలి.






# ప్రోమిలాన్ 2024కు హాజరైన గూడెం విద్యార్థులు

తాడేపల్లిగూడెం ఆదికవి నన్నయ యూనివర్శిటీ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ డిపార్ట్మెంట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ విద్యార్థులు భీమవరంలోని శ్రీవిష్ణు ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన ప్రోమిలాన్ 2024లో "ఫార్మాస్యూటికల్ పరిశ్రమ వృద్ధిలో బయోసిమిలర్ల పాత్ర మరియు ఇటీవలి ఆవిష్కరణల పాత్ర" అనే అంశంపై జరిగిన జాతీయ సెమినార్లో పాల్గొన్నారు.

నన్నయ విశ్వవిద్యాలయం విద్యార్థులు వివిధ మౌఖిక మరియు పోస్టర్ ప్రదర్శనలలో పాల్గొనడం ద్వారా సెమినార్లో ప్రత్యేక గుర్తింపును సాధించారు. ఔషధాల పురోగతికి, పరిశోధన మరియు ఆవిష్కరణల సంస్కృతిని పెంపొందించడానికి విభాగం యొక్క అంకితభావాన్ని తెలియజేసారు.

సెమినార్ విద్యార్థులకు అంతర్దృష్టులు, ఆలోచనలు మరియు నైపుణ్యాన్ని నిపుణులతో పరస్పరం పంచుకున్నారు. వారి ప్రదర్శనల ద్వారా, నన్నయ విద్యార్థులు బయోసిమిలర్లపై లోతైన అవగాహనను ప్రదర్శించారు. ఫార్మాస్యూటికల్ రంగంలో సమకాలీన సవాళ్లను పరిష్కరించడంలో వారి వినూత్న విధానాలను ప్రదర్శించారు. ప్రిన్సిపల్ ఆచార్య టి.అశోక్ విద్యార్థులను అభినందించారు.

**తెలుగు విద్యార్థుల ఫ్రెషర్స్ పార్టీ**

ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ తెలుగు శాఖ సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు ఫ్రెషర్స్ పార్టీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విశ్వవిద్యాలయ వసతులు, వనరుల గురించి తెలియజేస్తూ పలు సూచనలిచ్చారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు.

## దరహాసం

భూమండలం మీద ఉన్న సమస్త జీవరాశులలో నవ్వగలిగే ఏకైక ప్రాణి మనిషి. "నవ్వటం ఒక భోగం నవ్వలేకపోవటం ఒక రోగం" అన్నారు పెద్దలు.మనిషి ఉరుకుల పరుగుల జీవితంలో కోల్పోయిన మహా మంత్రం నవ్వు. యంత్రంలా మారిన మానవున్ని దానవుడ్ని నవ్వు అనే మంత్రం మనిషిని చేస్తుంది. ఈ ఉరుకుల పరుగుల జీవితం మానవుని దానవుడిగా మార్చింది. ఈ దానవుణ్ణి మళ్లీ మనిషిగా మార్చే మంత్రం మాత్రం నవ్వే. కాబట్టి ఆగండి హాయిగా నవ్వండి.నవ్వు నానా విధాలు అంటారు.అవును కల్మషం లేని పసిపాపల నవ్వు, నాన్న ముఖంలో కష్టాల సంసార సాగరంలో కష్టాన్ని కనిపించకుండా కనిపించే నవ్వు, వృద్ధాప్యంలో చీదరింపుల చివాట్ల మధ్య మానవత్వాన్ని పలికించే పరిపూర్ణమైన నవ్వు, నువ్వు నీలా ఉంటే నీ వెంట ఉండేది నీ నవ్వు. నువ్వు నవ్వడం లేదు అంటే నిన్ను నువ్వు కోల్పోయావని అర్థం. ప్రేయసీప్రియుల బాంధవ్యాన్ని నిలిపేది నవ్వు ,నిన్ను ప్రపంచానికి కొత్తగా పరిచయం చేసేది నవ్వు. అలాంటి నవ్వులలో



పంచదార నవ్వులు పలకరింపుల పువ్వులు. హాయిగా నవ్వుకున్నప్పుడు ఆనంద భాష్పాలు మనలో బాధను బయటికి పంపించేస్తుంది. మళ్ళీ తన లక్ష్యానికి కావలసిన ఉత్సాహాన్ని ఇస్తుంది. కష్టాల కొలిమిలో కరిగిపోతున్న మానవునికి ఖర్చు లేని కంకణం చిరునవ్వు. నవ్వండి.నవ్వించండి. సమస్త భూమండలాన్ని స్వర్గమయం చేయండి. సర్వేజనా సుఖినోభవంతు.

**- కె.మనోజ్ కుమార్,**
**అనూర్ అలుమ్ని.**

# సిరివెన్నెల సమగ్ర సాహిత్యం




తానా ప్రపంచ సాహిత్య వేదిక, అమెరికా తెలుగు సంఘం ప్రచురించిన సిరివెన్నెల సీతారామశాస్త్రి సమగ్ర సాహిత్యం ఆరు సంపుటాలను ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు నన్నయ భారతికి సమర్పిస్తూ ఆవిష్కరించారు. అమెరికా తెలుగు సంఘం అత్యద్భుతంగా సీతారామశాస్త్రి సమగ్ర సాహిత్యాన్ని ప్రచురించడం సంతోషదాయకమని,వాటిని విశ్వవిద్యాలయానికి అందించి సాహిత్య అభిమానులకు,తెలుగు విద్యార్థులకు, పరిశోధకులకు అందుబాటులో ఉండేలా చేశారని తానా ప్రపంచ సాహిత్య వేదికకు కృతజ్ఞతలు తెలియజేశారు.

సిరివెన్నెల చలనచిత్రం ద్వారా గొప్ప గీతాలను అందించి సిరివెన్నెల ఇంటిపేరుగా చేసుకున్నారని, సీతారామశాస్త్రి గారి పాటలు భారతీయ సంస్కృతి విలువలతో కూడి ఉంటాయని, వారి పాటలు సంగీత అభిమానుల హృదయాల్లో శాశ్వతంగా నిలుస్తాయని ఆచార్య పద్మరాజు అన్నారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ సమాజాన్ని జాగృతం చేసే, ఆలోచింపచేసే సాహిత్యాన్ని ఆయన అందించారని, తెలుగు శాఖ నిర్వహించిన సదస్సుకి ఆయన విశ్వవిద్యాలయానికి విచ్చేసి ప్రేరణాత్మకంగా ఉపన్యసించారని గుర్తు చేశారు.

సీతారామశాస్త్రి సమగ్ర సాహిత్యాన్ని నన్నయభారతిలో చూసి తెలుగు విద్యార్థులు సంతోషించారని మంచి గ్రంథాలను అందించిన ఆచార్య పద్మరాజు గారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గ్రంథాలయ సమన్వయకర్త, విశ్వవిద్యాలయ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా.పి. విజయనిర్మల, నన్నయభారతి కోఆర్డినేటర్ డా.తలారి వాసు పాల్గొన్నారు.

## మంచిమాట



**మనసులో అశాంతి ఉంటే**
**ప్రతి విషయం గందరగోళంగానే**
**అనిపిస్తుంది**

# పితృదేవో భవ!

నాన్న.
నిలువెత్తు త్యాగాల రూపు!
ఎన్నో కష్టాల కొలిమి!
బిడ్డల క్షేమం,
ఉన్నతి కోసం
ఎంతటి శ్రమకైనా వెనకాడడు తండ్రి.
తన సర్వస్వాన్ని అర్పించి,
కుటుంబ క్షేమంలోనే తన
ఆనందం చూసుకుంటాడు.
అంతటి మహోన్నత త్యాగ మూర్తి
గురించి ధర్మం ఏమని చెబుతుంది..
ఎలా ఉండాలంటే....

"లాలయేత్ పంచవర్షాణి,
దశ వర్షాణి తాడయేత్
ప్రాప్తేతు షోడశే వర్షే
పుత్రం మిత్రవదాచరేత్"
అంటుంది చాణక్యుడి నీతిశాస్త్రం.
బిడ్డకు అయిదేళ్లు వచ్చేవరకూ తండ్రి లాలించి, వాత్సల్యం చూపించాలి.
ఆ తర్వాత పదేళ్లు పిల్లలు మంచి మార్గంలో నడిచే విషయంలో దండించటానికీ వెనకాడకూడదు.
పదహారేళ్లు రాగానే సంతానంతో
మిత్రుడిలా మెలగాలని.

వేదం 'పితృదేవోభవ' అంటూ
తండ్రిని దైవంగా చూడాలని చెబితే,
శాస్త్రాలు ఆయనకి విష్ణు స్థానమిచ్చాయి.
జగత్తును పాలించి పోషించేది విష్ణుమూర్తి.
అందువల్ల కుటుంబాన్ని పోషించే తండ్రిని విష్ణు సమానుడిగా చెప్పాయి.

"నమో పిత్రే జన్మధాత్రే సర్వదేవమయాయచ// సుఖదాయ ప్రసన్నాయ సుప్రీతాయ మహాత్మనే//
దుర్లభం మానుషమిదం
యేనలబ్ధం మయావపుః/
సంభావనీయం ధర్మార్థే తస్మై పిత్రే నమోనమః"
ఇలా సాగుతుంది
బృహద్ధర్మ పురాణంలో.

దుర్లభమైన మనుష్య జన్మ ఇచ్చి,
సుఖంగా జీవితాన్ని గడిపేలా చేస్తూ,
చిన్ననాటి నుంచి తప్పులన్నీ క్షమిస్తూ,
మంచి మార్గంలో నడిపే తండ్రిని
ఆ పురాణం ఎంతగానో కీర్తించింది.

బిడ్డల కోసం తండ్రి చేసే
త్యాగాలు వెలకట్టలేనివి.
తాను ఎన్ని కష్టాలు అనుభవించైనా
పిల్లల్ని ఉన్నత స్థానానికి తీసుకెళ్లాలని దివారాత్రాలు శ్రమిస్తాడు నాన్న.
ఆ క్రమంలో తన గురించి తను
పూర్తిగా మర్చిపోతాడు.
అయినా,
నాన్న పడే కష్టం బయటికి కనిపించదు.
అందుకే,
అమ్మ తొమ్మిది నెలలు మోస్తే...
నాన్న జీవితాంతం మోస్తాడు..
అయినా నాన్నెందుకో వెనకబడ్డాడు..
అమ్మకు బీరువా నిండా
రంగురంగుల దుస్తులు..
నాన్న దుస్తులకు దండెం కూడా నిండదు..
తనని తాను పట్టించుకోవటం రాని నాన్న ఎందుకో వెనుకబడ్డాడు'
అని తండ్రి త్యాగాల్ని వివరించే
ప్రయత్నం చేశారు ఓ కవి.

గృహ వ్యవహారాల్లో తల్లి పాత్ర కీలకం.
అయితే లోక వ్యవహారంలో తండ్రిదే
ప్రధాన భూమిక.
తండ్రి వంశమే కుమారుడికి వస్తుంది.
క్రమశిక్షణ, నీతి, నిజాయతీ లాంటివన్నీ పిల్లలకు నేర్పుతాడు తండ్రి.
నాన్న వేలు పట్టుకునే
బిడ్డ లోకాన్ని చూస్తాడు.
దాశరథి, మారుతి, జానకి, ద్రౌపది, కైక ఇలా ఇతిహాసాల్లో తండ్రి పేరుతోనే బిడ్డలు విఖ్యాతులవటం తెలిసిందే.
ఉత్తరాదిన పేరు చివర
తండ్రి నామం కూడా వస్తుంది.
భారత జాతిపిత 'మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ' పేరులో తండ్రి



'కరమ్‌చంద్' ఉన్నాడు.

గొప్పవారెందరో
బిడ్డకు ఏ చిన్న కష్టం కలిగినా తల్లడిల్లిపోతాడు తండ్రి.
నిరంతరం తన పిల్లల క్షేమం గురించే ఆలోచిస్తుంటాడు.

ఇంద్రుడి వజ్రాయుధ ఘాతానికి మూర్ఛిల్లిన బాలాంజనేయుణ్ని చూసివాయుదేవుడు కుమిలిపోయాడు.
లోకాల్ని స్తంభింప జేశాడు.

విభాండక మహర్షి తానే తల్లీతండ్రీ
అయ్యి రుష్యశృంగుణ్ని కంటికి రెప్పలా చూసుకున్నాడు...
ఇలా తనయుల క్షేమం కోసం పరితపించిన తండ్రులు పురాణేతిహాసాల్లో
ఎందరో కనిపిస్తారు.
కష్టం వచ్చినప్పుడు నాన్న ఉన్నాడన్న ధైర్యం గొప్ప సాంత్వననిస్తుంది.

పిల్లల పట్ల అంధ ప్రేమ ఎంతటి వినాశనానికి దారితీస్తుందో ధృతరాష్ట్రుడి ద్వారా తెలుస్తుంది.
తండ్రి విలువ గ్రహించి,
ఆయన పట్ల పూర్తి భక్తిప్రపత్తులతో మెలిగిన పుత్రులు పురాణేతిహాసాల్లో కనిపిస్తారు.

పితృవాక్య పాలన విషయంలో
రాముడు అందరికీ ఆదర్శం.
యాగరక్షణార్థం వెళ్లిన రాముడితో విశ్వామిత్రుడు తాటకిని వధించాలని చెప్పినప్పుడు
'పితుర్వచన నిర్దేశాత్ పితుర్వచన
గౌరవాత్/ వచనం కౌశికస్యేతి కర్తవ్యం
అవిశంకయా//' అంటాడు రాముడు.
మీతో పంపించేటప్పుడు మీరు ఏం చెబితే అది చెయ్యమన్నారు నాన్నగారు.
కాబట్టి తాటకిని వధిస్తాను' అని చెబుతాడు.

పరశురాముడు కూడా తండ్రి జమదగ్ని
ఆజ్ఞ మేరకు కన్నతల్లిని సంహరించాడు.
తర్వాత తండ్రి వరంతో మాతృమూర్తిని తిరిగి బతికించుకున్నాడు.
తండ్రి కోసం గొప్ప త్యాగాలు చేసిన పుత్రులు కూడా ఉన్నారు.
శంతనుడి కోసం దేవవ్రతుడు
వివాహమే చేసుకోనని,
రాజ్యం తన సవతితల్లి సత్యవతి కుమారులకే దక్కుతుందని భీష్మ ప్రతిజ్ఞ చేసి భీష్ముడిగా ప్రసిద్ధికెక్కాడు.

తండ్రి యయాతికి శుక్రాచార్యుడి శాపం వల్ల ఏర్పడిన ముసలితనాన్ని తాను స్వీకరించి, తన యవ్వనాన్ని జనకుడికి దానం చేశాడు పూరుడు.
తండ్రి మెడలో చనిపోయిన పాము వేసి పరాభవించిన పరీక్షిత్తుకు మరణశాసనమే రాశాడు శృంగి.

పేరుకు రాక్షస రాజైనా
పిల్లలు చదివినా చదవకున్నా
తండ్రి వారిని పోషిస్తాడు.
స్నేహంగా బుద్ధి నేర్పుతాడు.
కష్టం కలగకుండా కాపాడతాడు.
శతృత్వం వహించడు' అంటాడు హిరణ్యకశిపుడు భాగవతంలో.

పుట్టిన వెంటనే కన్నయ్యని పదిలంగా హృదయానికి హత్తుకుని అర్ధరాత్రి యమునను దాటించాడు వసుదేవుడు.
ఆ సమయంలో బిడ్డ కోసం గాడిద కాళ్లు కూడా పట్టుకున్నాడు.
పిల్లల కోసం ఎన్ని అవమానాలనైనా సహిస్తాడు తండ్రి.

'శకుంతల అత్తారింటికి వెళ్తుంటే బాధతో కంఠం పట్టేసి నోట మాట రావటం లేదు.
కంట్లో నీరు చేరి చూపు ఆనటంలేదు.
మునివృత్తిలో ఉన్న నాకే ఇంత బాధగా ఉంటే గృహస్థులకి ఇంకెంత ఆవేదనో కదా' అంటాడు కణ్వ మహర్షి శాకుంతలంలో.
చిన్ననాటి నుంచి శకుంతలను ప్రేమగా పెంచిన మమకారం అలాంటిది మరి!

ఉత్తమ పుత్రుడు తండ్రి జీవించినంతకాలం ఆయన చెప్పింది చెయ్యాలి.
తండ్రి గతించిన రోజున ఏటా భారీగా అన్నదానం చెయ్యాలి.
గయలో పింద ప్రదానం నిర్వహించాలని చెబుతాయి శాస్త్రాలు.

ఈ మూడింటిలో చివరి రెండూ అటుంచితే,
కనీసం తండ్రి మాటకు చివరి వరకూ విలువ ఇస్తే అదే ఆయనపట్ల చూపే కొండంత గౌరవం.

సంతాన వృద్ధి కోసం
రెక్కలు ముక్కలు చేసుకొని,
తినీతినక కష్టపడి కూడబెట్టినదాన్ని బిడ్డలకిస్తారు తల్లిదండ్రులు.

అలాంటి వారిని వృద్ధాప్యంలో పట్టించుకోని సంతానానికి నిష్కృతి ఉంటుందా...//

**(రసజ్ఞ భారతి సాహిత్య వేదిక నుండి....)**